## యానాల యల్లమ్మకు మాజీ మంత్రి పరామర్శ



యల్లమ్మను పరామర్శిస్తున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట టౌన్, డిసెంబర్ 25: జిల్లా కేంద్రానికి చెందిన స్థానిక గ్రంథాలయ మాజీ చైర్మన్ యానాల యాదగిరిరెడ్డి సతీమణి యల్లమ్మ గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంట కండ్ల జగదీశ్‌రెడ్డి బుధవారం ఆమె నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని వైద్యులతో ఫోన్‌లో మాట్లాడి మెరుగైన చికిత్స అందించాలని కోరారు. అనంతరం కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

## ఓపెన్ టెన్త్, ఇంటర్ అడ్మిషన్ల గడువు పొడిగింపు

నూతనకల్, డిసెంబర్ 25: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓపెన్ టెన్త్, ఇంటర్ అడ్మిషన్ల గడువు ఈ నెల 30వ తేదీ వరకు పొడిగించినట్లు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాములు నాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి లోపు చదువు మధ్యలో మానేసిన వారు ఆధార్ కార్డు, రెండు పాస్‌ఫొటోలతో వచ్చి అడ్మిషన్లు పొందవచ్చని తెలిపారు. ఇంటర్‌లో ప్రవేశానికి పదో తరగతి మెమో, టీసీ, ఆధార్‌కార్డు, ఫొటోలతో రావాలని సూచించారు. పూర్తి వివరాలకు పాఠశాలలో సంప్రదించాలని పేర్కొన్నారు.

## గంజాయి విక్రేతలు అరెస్ట్

చౌటుప్పల్ రూరల్, డిసెంబర్ 25 : పట్టణంలోని బస్టాండ్‌లో గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. వివరాలు.. బస్టాండ్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి బ్యాగులు తనిఖీ చేయగా 14 కేజీల గంజాయి లభించింది. నిందితులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అక్కెనపల్లి జిల్లాకు చెందిన చెల్లూరి నాగవెంకట కృష్ణవేణి, అడ్డూరి ప్రసాద్, కిమ్మిడి ప్రశాంత్‌గా గుర్తించారు. వీరు విశాఖపట్నంలో గంజాయిని కొనుగోలు చేసి హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు విచారణలో తెలిసిందని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ మన్మథరావు తెలిపారు.

## బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ



కొణతం సత్యనారాయణరెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి

నేరేడుచర్ల, డిసెంబర్ 25: నేరేడుచర్ల మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు కొణతం సత్యనారాయణరెడ్డి మనవరాలు దుర్గశ్రేవాసిని ఇటీవల అమెరికాలో అనారోగ్యంతో మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి బుధవారం సత్యనారాయణరెడ్డి ఇంటికి వెళ్లి పరామర్శించారు. దుర్గశ్రేవాసిని చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఆయన వెంట మిర్యాలగూడ వ్యవసాయ కమిటీ మాజీ చైర్మన్ చిట్టిబాబు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అరిబండి సురేశ్‌బాబు, పట్టణ ప్రధాన కార్యదర్శి చిత్తలూరి సైదులు ఉన్నారు.

## ఐక్యతతోనే రాజ్యాధికారం సాధ్యం

- బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనుంజయ నాయుడు



నేరేడుచర్లలో మనుస్మృతి ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

నేరేడుచర్ల, డిసెంబర్ 25: బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలు ఐక్యంగా పోరాడితేనే రాజ్యాధికారం సాధ్యమవుతుందని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.ధనుంజయ నాయుడు అన్నారు. మండల కేంద్రంలోని ప్రధాన కూడలి వద్ద బుధవారం సంఘం ఆధ్వర్యంలో మనుస్మృతి ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం మనుధర్మ శాస్త్రాన్ని అడ్డం పెట్టుకొని ఎస్సీ వర్గీకరణతో పాటు అనేక అంశాలను పక్కదోవ పట్టిస్తోందని ఆరోపించారు. దేశంలో 92 శాతం పైగా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు అధికారం దక్కకుండా కేవలం ఎనిమిది శాతం మాత్రమే ఉన్న అగ్రవర్ణాలు దశాబ్దాల తరబడి అధికారం చెలాయిస్తున్నారని పేర్కొన్నారు. రాజ్యాధికార సాధనకు ఐక్యంగా పోరాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను, ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకుడు కొమ్మరాజు వెంకట్, మలిగిరెడ్డి జనార్దన్ రెడ్డి, పానుగంటి మహేశ్, మజరత్, కాటయ్య, లక్ష్మయ్య, లింగయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## 'విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలి'

నాగారం, డిసెంబర్ 25: మండల కేంద్రంలోని ఎక్స్‌రోడ్డు చౌరస్తా వద్ద హైమాస్ట్ లైట్లు, స్తంభాలకు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ యువజన నాయకుడు బుర్రి సురేశ్‌రెడ్డి కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మండల కేంద్రానికి నిత్యం అనేక పనులతో 10 గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారని తెలిపారు. అయితే, సాయంత్రం ఆరు గంటల తర్వాత చీకటి అలుముకొని ఉంటుండడంతో మండల ఆఫీసులకు, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని తెలిపారు. అధికారులు స్పందించి విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

**వధువు కావలెను**

ఆర్య వైశ్య అబ్బాయి 36 M.Ed. ప్రైవేట్ లెక్చరర్, వ్యవసాయం, 24 వేలు, ఆస్థి 70 లక్షలు, నల్లగొండ, వీరయ్య 9121325068, కోమట్ల అమ్మాయి కావలెను 1వ, M9HB, మునుగోడు రోడ్డు కు వ్రాయండి.

NLG-

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...

ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-

Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం

పూర్తి వివరాలకు:
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం,
గ్రా॥ చర్లపల్లి, మం॥ నల్లగొండ.

| | | |
|---|---|---|
| నల్లగొండ : 9182777626 | నల్లగొండ : 9182777635 | దేవరకొండ : 9182777635 |
| హాలియా : 9182777059 | సూర్యాపేట : 9182777630 | భువనగిరి : 9182777638 |
| మిర్యాలగూడ : 9182777059 | కోదాడ : 9182777630 | చౌటుప్పల్ : 9182777638 |

# పల్లెల్లో అధ్వానంగా పారిశుధ్యం

- రోడ్లపై దర్శనమిస్తున్న మురుగు
- ఎక్కడి చెత్త అక్కడే



కాపుగల్లు గ్రామంలోని ఒకటో వార్డులో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు



కూచిపూడి గ్రామ శివారులోని ప్రధాన రహదారి పక్కన చెత్తకుప్పలు

కోదాడ రూరల్, డిసెంబర్ 25: గ్రామాల్లో పారిశుధ్యం పడకేసింది. సర్పంచుల పదవీ కాలం ముగిసి సంవత్సరం కావొస్తున్నా నేటికీ ఎన్నికలు నిర్వహించకపోవడంతో గ్రామాల పాలన ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు నిర్వహిస్తున్నారు. అయితే, ప్రభుత్వం నుంచి పంచాయతీలకు నిధులు లేవపోవడంతో పలు గ్రామాల్లో పాలన అస్తవ్యస్తంగా మారింది. ఎక్కడ మురికి అక్కడే ఉండిపోవడం, చెత్త సేకరణ లేకపోవడం, ఎత్తిన చెత్తను డంపింగ్ యార్డులో కాకుండా గ్రామ శివారుల్లో రహదారులపై వేస్తుండడంతో దుర్వాసన వెదజల్లుతోంది. డ్రెయిన్లలో పూడిక తీయకపోవడంతో మురుగు నీరు వీధుల్లో ప్రవహిస్తోంది. దీంతో ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారు. ప్రజాప్రతినిధులు ఉన్నట్లయితే తమ సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకునే వారిమని ప్రజలు చెబుతున్నారు. ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలు నిర్వహించి గ్రామాల అభివృద్ధికి సహకరించాలని కోరుతున్నారు.

### వీధి అంతా మురుగుమయం



కాపుగల్లు గ్రామంలోని ఒకటో వార్డులో మురుగు కాల్వల్లో పూడిక తీయకపోవడం, అదేవిధంగా సరైన డ్రెయిన్లు లేకపోవడంతో మురుగు నీరు పూర్తిగా రోడ్డుపై ప్రవహిస్తోంది. దీంతో దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో పారిశుధ్య పనుల నిర్వహణకు సరైన సిబ్బంది లేకపోవడంతో అస్తవ్యస్తంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగు నీరు రోడ్డుపైకి రాకుండా చర్యలు చేపట్టాలి.

- కాసాని వీరబాబు, 1వ వార్డు, కాపుగల్లు

### ప్రధాన రహదారులపైనే చెత్త డంపింగ్



పల్లెల్లో పారిశుద్ధ్యానికి గత ప్రభుత్వం పెద్దపీట వేసింది. అందులో భాగంగానే ప్రతి గ్రామానికి డంపింగ్ యార్డు ఏర్పాటు చేశారు. కానీ, నేడు ప్రజాప్రతినిధులు లేక, అధికారుల పాలనలో గ్రామ శివారులు డంపింగ్ యార్డులుగా మారాయి. నాడు పచ్చని చెట్లతో కళకళలాడిన పల్లెలు నేడు దుర్వాసనతో స్వాగతం పలుకుతున్నాయి. పల్లె ప్రకృతి వనాలను సైతం అధికారులు పట్టించుకోకపోవడంతో పిచ్చి మొక్కలు పెరిగి అడవిని తలపిస్తున్నాయి. అధికారులు ఇప్పటికైనా పల్లెల పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలి.

- పసుపులేటి రామాంజనేయులు, కూచిపూడి

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అర్వపల్లి, డిసెంబర్ 25: విద్యుత్ షాక్‌కు గురైన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన మండలంలోని రామన్నగూడెంలో చోటుచేసుకుంది. ఎస్ఐ బాలకృష్ణ కథనం ప్రకారం.. రామన్నగూడెం గ్రామానికి చెందిన గుడిపాటి వెంకన్న (44) ఈ నెల 19వ తేదీన ఉదయం తన వ్యవసాయ భూమి వద్దకు వెళ్లాడు. బోరు పోయకపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి ఫ్యూజ్ మార్చే ప్రయత్నం చేస్తుండగా విద్యుత్ షాక్ తగిలింది. తీవ్ర గాయాలపాలైన ఆయనను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఉస్మానియా హాస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతిచెందాడు. మృతుడి భార్య సైదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## బీసీ యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా వీరబాబు



వీరబాబుకు నియామకపత్రం అందజేస్తున్న ఆర్.కృష్ణయ్య

సూర్యాపేట టౌన్, డిసెంబర్ 25: బీసీ యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా బొలిశెట్టి వీరబాబును నియమిస్తూ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య బుధవారం హైదరాబాద్‌లో నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీరబాబు మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు. సంఘం అభివృద్ధికి పాటుపడతానని తెలిపారు.

## రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు

- ప్రజల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజలు

కోదాడ రూరల్, డిసెంబర్ 25: మండల పరిధి కాపుగల్లు గ్రామంలోని 1వ వార్డులో డ్రెయిన్లలో పూడిక తీయకపోవడంతో మురుగు నీరు రోడ్డుపై, వీధుల్లో ప్రవహిస్తోందని బుధవారం వార్డు సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. దీంతో దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పూడికతీత పనులు చేపట్టాలని కోరారు.

## మృతురాలి కుటుంబానికి బీఆర్ఎస్ నాయకుల సాయం



లలిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

అర్వపల్లి, డిసెంబర్ 25: మండల పరిధిలోని పర్సాయపల్లి గ్రామానికి చెందిన పంది లలిత ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఆమెది నిరుపేద కుటుంబం కావడంతో స్థానిక బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి బుధవారం లలిత కుటుంబ సభ్యులకు రూ.15 వేల ఆర్థిక సాయంతో పాటు క్వింటా బియ్యం అందజేశారు. అనంతరం లలిత చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు కొప్పుల భరత్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ఎర్ర నరసయ్య, మాజీ ఎంపీటీసీ రాచకొండ గీతాసురేశ్, తోట కృష్ణ, కళ నర్సయ్య, మాజీ గ్రంథాలయ చైర్మన్ యుగంధర్, మిర్యాల వెంకన్న, మత్స్యశాఖ అధ్యక్షుడు అంకిరెడ్డి లింగయ్య, మాజీ రైతు కోఆర్డినేటర్ లింగయ్య, శ్రీను, వెంకన్న, ప్రభాకర్, రేణుక, కృష్ణ, శారద, ప్రియాంక, సుధాకర్, రాజా, రాందాస్, వీరయ్య, హరీశ్, రవి, వీరు పాల్గొన్నారు.

## సారా పట్టివేత... ఇద్దరిపై కేసు



స్వాధీనం చేసుకున్న నల్ల బెల్లం, పటికతో ఎస్ఐ వీరన్న, సిబ్బంది

మద్దిరాల, డిసెంబర్ 25: అక్రమంగా నిల్వ ఉంచిన క్వింటా నల్ల బెల్లం, ఐదు కేజీల పటిక, 10 లీటర్ల సారాను పట్టుకొని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ వీరన్న తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం.. మండలంలోని గుట్టకాడి తండా ఆవాసం సెట్రాం తండాకు చెందిన కొర్ర శ్రీను తన ఇంట్లో నల్ల బెల్లం నిల్వ ఉంచాడన్న సమాచారంతో పోలీసులు దాడి చేశారు. ఈ దాడుల్లో క్వింటా నల్ల బెల్లం, ఐదు కేజీల పటిక లభ్యమైంది. అదే తండాకు చెందిన నేనావత్ దుర్గమ్మ ఇంట్లో 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు. ఎవరైనా ప్రభుత్వ నిషేధిత కార్యక్రమాలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కొండమల్లేపల్లి, డిసెంబర్ 25 : అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను బుధవారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ రామ్మూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. దేవరకొండ మండలంలోని దుబ్బతండా, మైనంపల్లి తండా, తాటికోల్ గ్రామాలకు చెందిన వంకునావత్ రాంబాబు, ఇస్లావత్ జీవన్, ఇస్లావత్ హనుమంతు ప్రభుత్వ అనుమతులు లేకుండా తమ ట్రాక్టర్ల ద్వారా తాటికోల్ వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా మండల కేంద్రంలోని దేవరకొండ రోడ్డులో పట్టుకున్నారు. ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించడంతో పాటు ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుకను అక్రమంగా రవాణా చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేశారు.

## కారు పల్టీ

- ఇద్దరికి గాయాలు



పల్టీకొట్టిన కారు

భువనగిరి కలెక్టరేట్, డిసెంబర్ 25 : పట్టణ పరిధిలోని రాయగిరి వద్ద బుధవారం కారు అదుపుతప్పి పల్టీ కొట్టగా ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. హైదరాబాద్‌కు చెందిన నర్సింహారెడ్డి ఆలేరు నుంచి హైదరాబాద్‌కు తన కారులో వస్తుండగా మార్గమధ్యంలో రాయగిరి ఫ్లై ఓవర్ బ్రిడ్జి ఎక్కే క్రమంలో అదుపు తప్పి పల్టీ కొట్టింది. దీంతో డ్రైవర్‌తో పాటు నర్సింహారెడ్డికి గాయాలయ్యాయి.

## వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

- కోదాడ పట్టణ సీఐ రాము



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న పట్టణ సీఐ రాము

కోదాడ రూరల్, డిసెంబర్ 25: వాహనదారులు తప్పక ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోదాడ పట్టణ సీఐ రాము అన్నారు. బుధవారం రాత్రి పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. వాహనాలకు నంబర్ ప్లేట్ తప్పనిసరిగా ఉండాలని సూచించారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించొద్దని అన్నారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని 35 ఆటోలు, 33 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ ఎస్కే.సైదులు, ఏఎస్ఐ రమేశ్, కేపీ చారి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న డీఎస్పీ రవి దంపతులు

సూర్యాపేట టౌన్: క్రిస్మస్ సందర్భంగా జిల్లా కేంద్రంలోని 4వ వార్డు బేతస్థ మందిరంలో డీఎస్పీ రవి, కవిత దంపతులు 100 మంది వితంతు, పేద మహిళలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తప్పెట్ల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు రగ్గుల వితరణ



పేదలకు రగ్గులను పంపిణీ చేస్తున్న ట్రస్ట్ సభ్యులు

హుజూర్‌నగర్, డిసెంబర్ 25: క్రిస్మస్‌ను పురస్కరించుకొని బుధవారం పట్టణంలోని సీయోను ప్రార్థన మందిరంలో హోప్ ఇన్ లైఫ్ ఇంటర్నేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 200 మంది పేదలకు రగ్గులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సుధా, బాబురావు, రాణమ్మ, విక్టోరియా, విజయ్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

## కత్తితో గొంతు కోసుకున్న మానసిక రోగి

- ఆస్పత్రికి తరలించిన పోలీసులు

నీలగిరి, డిసెంబర్ 25: మానసిక వ్యాధితో బాధపడుతున్న వ్యక్తి బుధవారం తెల్లవారుజామున నల్లగొండలోని క్లాక్‌టవర్ వద్ద తాగిన మైకంలో గొంతు కోసుకున్నాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకొని అతడిని ఆస్పత్రికి తరలించారు. నల్లగొండ టూటౌన్ ఎస్ఐ నాగరాజు కథనం ప్రకారం.. నల్లగొండ హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన సయ్యద్ నదీమ్ కొంత కాలంగా మానసిక వ్యాధితో బాధపడుతూ రోడ్లపై తిరుగుతున్నాడు. మంగళవారం రాత్రి ఇంట్లో నుంచి వెళ్లిన నదీమ్ లతీఫ్ సాబ్ గుట్ట సమీపంలోకి వెళ్లి మద్యం సేవించాడు. తాగిన మైకంలో కత్తితో తన గొంతు కోసుకున్నాడు. తీవ్ర రక్తస్రావంతో పడి ఉన్న అతడిని గమనించిన స్థానిక యువకులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న టూటౌన్ ఎస్ఐ రావుల నాగరాజు రక్తస్రావం కాకుండా గొంతువద్ద కర్చీఫ్‌తో కట్టుకట్టి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు గొంతుపై స్వల్పంగా కోసుకోవడంతో కుట్లు వేశారు. ప్రాణాపాయం ఏమీ లేదని తెలిపారు. మానసికంగా బాధపడుతున్న నదీమ్ తనను ఎవరో చంపాలని చూస్తున్నారని, అందుకే తానే ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించానని చెబుతున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. చికిత్స అనంతరం అతడి కుటుంబ సభ్యులను పిలిచి కౌన్సెలింగ్ ఇవ్వనున్నట్లు తెలిపారు.

## ఆశ కార్యకర్తలకు రూ.18 వేల వేతనం అందించాలి

- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

నీలగిరి, డిసెంబర్ 25 : ఆశ కార్యకర్తలకు రూ.18వేల కనీస వేతనం అందించడంతో పాటు పీఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆశ కార్యకర్తల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 15 నుంచి నిర్వహిస్తున్న బస్సు జాతా బుధవారం నల్లగొండ జిల్లా కేంద్రానికి చేరుకుంది. జాతాకు ఆశ కార్యకర్తలు బతుకమ్మలు, బోనాలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఎస్‌బీఆర్ ఫంక్షన్ హాల్లో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఆశ కార్యకర్తల వేతనం పెంచడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చిందని తెలిపారు.అధికారంలోకి వచ్చి ఏడాదైనా వాటిని అమలు చేయడం లేదన్నారు. ఈ బడ్జెట్ సమావేశాల్లోనే ఆశ కార్యకర్తల వేతనాలు పెంచే ప్రతిపాదనను ప్రభుత్వం చేపట్టాలని, లేని పక్షంలో నిరవధిక సమ్మెకు దిగుతామని ఆయన హెచ్చరించారు.కార్యక్రమంలో ఆశ యూనియన్ జిల్లా కార్యదర్శి టి. వెంకటమ్మ పాల్గొన్నారు.

# నాణ్యమైన విత్తనంతో అధిక దిగుబడి

- పంట దిగుబడిలో మొలక శాతం కీలకం
- రైతులకు అధికారుల సూచనలు



నేరేడుచర్ల మండలం చిల్లేపల్లిలో నాటు వేసిన పొలం

నేరేడుచర్ల, డిసెంబర్ 25: యాసంగి వరి సాగు పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. కొందరు రైతులు ఇప్పుడే నార్లు పోస్తుండగా, మరికొందరు నాట్లు వేస్తున్నారు. అయితే, నారు పోసే సమయంలో సరైన జాగ్రత్తలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించొచ్చని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. ఈ క్రమంలో రైతులు విత్తనాల ఎంపికకు అధిక ప్రాధాన్యమివ్వాలని చెబుతున్నారు. విత్తనం ఎంపికపైనే పంట దిగుబడి ఆధాపడి ఉంటుందని అంటున్నారు. ఈ నేపథ్యంలో నాణ్యమైన విత్తన రకాలు, వాటి వివరాలపై ప్రత్యేక కథనం.

### విత్తనాలు నాలుగు రకాలు

నాణ్యమైన విత్తనాలు నాలుగు రకాల్లో లభ్యమవుతాయి. బ్రీడర్, ఫౌండేషన్, సర్టిఫైడ్, ట్రూగ్‌పుల్ లేబుల్స్‌లో విత్తనాలు లభ్యమవుతాయి.

### బ్రీడర్ విత్తనం

ఇది అన్ని రకాల విత్తనాలకు మూల విత్తనం. దీన్ని కంపెనీలు ఆయా బ్రీడర్ల పరవ్యేక్షణలో పండిస్తారు. వ్యవసాయ పరిశోధన స్థానాల్లో శాస్త్రవేత్తలు రూపొందించేవి ఇలాంటి విత్తనాలే. ఈ విత్తనం 100 శాతం జన్యు నాణ్యత కలిగి ఉంటుంది. బ్రీడర్ సీడ్‌కు బంగారు రంగు ట్యాగ్ వేస్తారు. సీడ్ ధర చాలా ఎక్కువ. రైతులకు రెండు కిలోలకు మించి బ్రీడర్ సీడ్ ఇవ్వరు.

### ఫౌండేషన్ విత్తనం

ఈ విత్తనాన్ని బ్రీడర్ విత్తనం నుంచి ఉత్పత్తి చేస్తారు. వివిధ విత్తనోత్పత్తి సంస్థలు, సాంకేతిక నిపుణుల ఆధ్వర్యంలో పండిస్తారు. దాదాపు 100 శాతం జన్యు నాణ్యత కలిగి ఉంటుంది. ప్రైవేటు విత్తన కంపెనీలు వ్యవసాయ పరిశోధన కేంద్రాల నుంచి బ్రీడర్ విత్తనాలు తీసుకొని వెళ్లి ఫౌండేషన్ విత్తనాన్ని తయారు చేస్తాయి. ఈ సీడ్‌కు తెలుపు రంగు ట్యాగ్ వేస్తారు.

### సర్టిఫైడ్ విత్తనాలు

విత్తనం నుంచి నేరుగా సర్టిఫైడ్ (ధ్రువీకరించిన) విత్తనాలను ఉత్పత్తి చేస్తారు. వివిధ సంస్థలు, రైతుల పొలాల్లో కూడా విత్తన పర్యవేక్షకుల సమక్షంలో పండించే అవకాశం ఉంది. ఈ విత్తనానికి నీలిరంగు ట్యాగ్ వేస్తారు.

### ట్రూత్‌ఫుల్ లేబుల్

సర్టిఫైడ్ సీడ్ ఉత్పత్తి చేసిన ఈ విత్తనాన్ని విత్తిన ధ్రువీకరణ సంస్థ ధ్రువీకరించాల్సి ఉంటుంది. ఈ విత్తనాలను ట్రూత్‌ఫుల్ లేబుల్ కింద రైతులకు విక్రయిస్తుంటారు. ఈ విత్తనానికి ఆకుపచ్చ రంగు ట్యాగ్ వేస్తారు. లేబుల్ ట్యాగ్‌పై విత్తన పరీక్ష చేసిన తేదీ ఉంటుంది. ఆ తేదీ నుంచి తొమ్మిది నెలల కాల పరిమితిలోపు కొనుగోలు చేయవచ్చు.

### రైతులు పాటించాల్సిన సూచనలు

- వ్యవసాయ శాఖ లైసెన్స్ పొందిన డీలర్ల నుంచే విత్తనాలు కొనుగోలు చేయాలి.
- బిల్లుపై నంబర్, విత్తన రకం, గడువు తేదీలు, డీలర్ సంతకం, రైతు సంతకం ఉండేలా చూసుకోవాలి.
- లూజుగా ఉన్న సంచులు, పగిలిన ప్యాకెట్లు, తెరిచిన డబ్బాల నుంచి విత్తనాలు కొనుగోలు చేయొద్దు.
- గడువు దాటిన విత్తనాలను కొనుగోలు చేయకూడదు.
- కొనుగోలు చేసే విత్తన ప్యాకెట్‌పై సీలు ఉందో లేదో చూసుకోవాలి.
- కొన్న విత్తనాలను డీలరు వద్దే తూకం వేయించుకోవాలి.
- మొలకెత్తే దశ, పూత దశలో పంటలో లోపం కనిపిస్తే వెంటనే వ్యవసాయ అధికారిని సంప్రదించాలి.
- విత్తనాలు కొన్న వెంటనే మొలక శాతం చూసుకోవాలి. మొలక శాతం బాగా ఉన్న విత్తనాలనే వాడుకోవాలి.

### లైసెన్స్ ఉన్న విత్తనాలనే కొనుగోలు చేయాలి

వరి పంటలో అధిక దిగుబడులు సాధించాలంటే నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయాలి. దళారుల మాటలు నమ్మకుండా వ్యవసాయ శాఖ లైసెన్స్ పొందిన డీలర్ల వద్దనే విత్తనాలను కొనుగోలు చేయాలి. లూజుగా ఉన్న సంచులు, గడువు దాటిన విత్తనాలను కొనుగోలు చేయకూడదు. అధికారుల సలహాలు, సూచనలు పాటించి వరి సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించొచ్చు.

- షేక్ జావీద్, ఏఓ, నేరేడుచర్ల